రజినీకి విజయ్ ఫోన్

● భవిష్యత్ ప్రణాళికను వివరించిన దళపతి



అడయార్, ఫిబ్రవరి 8: 'సూపర్‌స్టార్' రజినీకాంత్‌తో తనకు మనస్పర్థలున్నాయంటూ జరుగుతున్న ప్రచారానికి అగ్రహీరో 'దళపతి' విజయ్ ఫుల్‌స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. ఆయన స్వయంగా రజినీకి ఫోన్ చేయడంతో పాటు తన కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు కోసం వివరించారు. 'తమిళ వెట్రి కళగం' పేరుతో విజయ్ కొత్త రాజకీయ పార్టీని స్థాపించగా, రజినీకాంత్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలిపిన విషయం తెలిసిందే. ఇందుకు కృతజ్ఞతలు తెలిపేందుకు రజినీకి విజయ్ ఫోన్ చేశారు. ఈ సందర్భంగా విజయ్ తన కొత్త రాజకీయ పార్టీ సిద్ధాంతాలు, తాజా రాజకీయ పరిస్థితులు, ప్రజాక్షేత్రంలోకి పార్టీని తీసుకెళ్లేందుకు తన వద్ద ఉన్న ప్రణాళికలు తదితర అంశాలను వివరించినట్టు సమాచారం. కేవలం పార్టీని స్థాపించడమే కాకుండా, రాజకీయాల్లో రాణించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, మహిళలను, యువతను ఆకట్టుకునేందుకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాల గురించి వారిద్దరి మధ్య చర్చకు వచ్చినట్టు తెలుస్తోంది. కాగా, తమిళగ వెట్రి కళగం పేరుతో రాజకీయ పార్టీని ప్రారంభించిన విజయ్.. ప్రస్తుతం తాను కమిట్ అయిన సినిమా ప్రాజెక్టులను పూర్తి చేసిన తర్వాత పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి రానున్నట్టు ప్రకటించిన విషయం తెల్సిందే. దీంతో చిత్ర పరిశ్రమకు చెందిన పలువురు విజయ్‌కు శుభాకాంక్షలు చెబుతున్నారు.

బడులకు బాంబు బెదిరింపులు

పరుగులు తీసిన తల్లిదండ్రులు ● నగరంలో పలుచోట్ల ఉద్రిక్తత



పిల్లలను ఇళ్లకు తీసుకెళ్తున్న తల్లిదండ్రులు



పాఠశాల యాజమాన్యం తల్లిదండ్రులకు పంపిన మెసేజ్



డీఏవీ స్కూలు వద్ద డాగ్ స్క్వాడ్

పెరంబూర్, ఫిబ్రవరి 8: నగరంలో పలు ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలలకు బాంబు బెదిరింపు రావడంతో తల్లిదండ్రులు భయభ్రాంతులకు లోనయ్యారు. బాంబులు బెదిరింపులు వచ్చినందున పిల్లల్ని తీసుకెళ్లాలంటూ పాఠశాలల నుంచి ఫోన్లు రావడంతో వారు తీవ్ర ఆందోళన చెందారు. స్థానిక అన్నానగర్, ప్యారీస్, గోపాలపురం, తిరుమిలిసై, ఆర్ఏ పురం, జేజే నగర్, పెరంబూర్ తదితర ప్రాంతాల్లోని 17కు పైగా ప్రైవేటు పాఠశాలలకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. పాఠశాల యాజమాన్యాలు ఆయా ప్రాంతాల్లోని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలు ఆయా పాఠశాలలకు చేరుకొని తనిఖీలు చేపట్టాయి. మధ్యాహ్నం కావడంతో పిల్లలకు భోజనం ఇచ్చేందుకు వచ్చిన తల్లిదండ్రులు బాంబు బెదిరింపు వార్త తెలుసుకొని దిగ్భ్రాంతి చెందారు. ఈ వార్త దావానలంలా వ్యాపించడంతో తల్లిదండ్రులతో పాటు స్థానికులు కూడా భారీగా పాఠశాలలకు చేరుకున్నారు. అప్పటికే పిల్లలను తరగతి గదుల నుంచి బయటకు తీసుకొని ఉపాధ్యాయులు, వారి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పలు పాఠశాలలు గురువారం పాఠశాలకు సెలవు ప్రకటించాయి.

వదంతులు మాత్రమే: పోలీసు శాఖ

నగరంలోని ప్రైవేటు పాఠశాలలకు వచ్చిన బాంబు బెదిరింపు వదంతి మాత్రమేనని, ఈ విషయమై తల్లిదండ్రులు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని నగర పోలీసుశాఖ స్పష్టం చేసింది. అదే సమయంలో బాంబు బెదిరింపుకు పాల్పడిన వారి ఆచూకీ తెలుసుకొనేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటుచేసినట్టు సైబర్ క్రైం పోలీసులు తెలిపారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి

● ఢిల్లీలో నల్లచొక్కాలు ధరించి డీఎంకే ఎంపీల ధర్నా

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో రాష్ట్రానికి చాలినన్ని నిధులు కేటాయించలేదని, కొత్త పథకాలకు సంబంధించి ప్రకటనలు లేవని ఆరోపిస్తూ డీఎంకే ఎంపీలు దేశ రాజధాని ఢిల్లీలో గురువారం ఉదయం నల్ల చొక్కాలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. బడ్జెట్ ప్రతిపాదనలపై పార్లమెంట్‌లో జరిగిన చర్చల సందర్భంగా రాష్ట్రానికి అవసరమైనంత మేరకు నిధులు విడుదల చేయలేదని, కొత్త పథకాల ఊసు లేదని, ఉన్న పథకాలకు నిధుల విడుదలపై ఎలాంటి ప్రకటనలు లేవని టీఆర్ బాలు ఇతర ఎంపీలు కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. రాష్ట్రం పట్ల కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య ధోరణిని ఖండిస్తూ నల్లచొక్కాలతో తమ పార్టీ ఎంపీలు, మిత్రపక్షాల ఎంపీలు ధర్నా జరుపుతారని కూడా ప్రకటించారు. ఆ



పార్లమెంట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న డీఎంకే, మిత్రపక్షాల ఎంపీలు

మేరకు గురువారం ఉదయం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడానికి ముందు గాంధీ విగ్రహం కూడలి వద్ద బాలు నాయకత్వంలో డీఎంకే ఎంపీలు ధర్నా జరిపారు. ఎంపీలు కనిమొళి, రాజా, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం ఎంపీలు కూడా ఆందోళనలో పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా నినాదాలు చేశారు. ఈ ధర్నాలో మహిళా ఎంపీలు నల్ల చీరలు ధరించి పాల్గొన్నారు.

ఏ కూటమిలో చేరినా 'టార్చిలైట్' తోనే పోటీ

కమల్ హాసన్



పెరంబూర్, ఫిబ్రవరి 8: ఏ కూటమిలో చేరినా 'టార్చిలైట్' చిహ్నంపైనే పోటీచేస్తామని, లేని పక్షంలో ప్రత్యేక చిహ్నంతో పోటీ చేస్తామని 'మక్కల్ నీది మయ్యం' (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్‌హాసన్ స్పష్టం చేశారు. త్వరలో జరుగనున్న పార్లమెంటు ఎన్నికల్లో కమల్‌హాసన్ నేతృత్వంలోని ఎంఎన్ఎం పార్టీ డీఎంకే కూటమిలో చేరే అవకాశముందని భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఇరుపార్టీల మధ్య చర్చలు జరుగుతుండగా కోయంబత్తూర్, దక్షిణ చెన్నై కోరుకుంటోంది. అయితే ఇందులో ఒకదానిని మాత్రం ఇచ్చేందుకు డీఎంకే సుముఖంగా వున్నట్లు సమాచారం. ఒకవేళ తమ కూటమిలో సీటు కేటాయిస్తే, తమ చిహ్నమైన 'ఉదయించే సూర్యుడు'పై పోటీచేయాలని డీఎంకే స్పష్టం చేసినట్లు సమాచారం. గత పార్లమెంటు ఎన్నికల్లో డీఎంకే కూటమిలో డీపీఐ పార్టీకి రెండు నియోజకవర్గాలు కేటాయించగా, వాటిలో ఒకస్థానంలో ఆ పార్టీ డీఎంకే చిహ్నంపై పోటీచేసింది. అలాగే, కమల్‌హాసన్ పార్టీకి కూడా ఈ నిబంధనతోనే సీటు కేటాయించే అవకాశముందని సమాచారం. కానీ, పార్లమెంటు ఎన్నికల్లో ఎంఎన్ఎంకు 'టార్చిలైట్' చిహ్నం కేటాయించాలని ఎన్నికల కమిషన్‌కు గత డిసెంబరు 17వ తేది లేఖతో పాటు దరఖాస్తు చేసుకున్నారు. అందుకు ఏ పార్టీతో కూటమి ఏర్పాటైనా 'టార్చిలైట్' చిహ్నంపై పోటీచేస్తామని కమల్‌హాసన్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ఆ చిహ్నం ఎన్నికల కమిషన్ కేటాయించని పక్షంలో, ప్రత్యేక చిహ్నంతో పోటీ చేస్తామని కమల్ పేర్కొన్నట్లు తెలుస్తోంది.

అన్నామలైపై కేసు రద్దుకు హైకోర్టు నిరాకరణ

● కొనసాగించవచ్చని కిందికోర్టుకు సూచన



పెరంబూర్, ఫిబ్రవరి 8: మత విద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారని తనపై నమోదైన కేసును రద్దు చేయాలని కోరుతూ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు చుక్కెదురైంది. ఆయనపై దాఖలైన కేసును కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. అంతేగాక ఆయనపై వున్న కేసు విచారణ చట్టపరంగా కొనసాగించవచ్చని కూడా స్పష్టం చేసింది. 2022లో యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో... దీపావళి పండుగకు టపాసులు కాల్చరాదంటూ క్రైస్తవ మిషనరీలు తొలుత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాయని అన్నామలై తెలిపారు. అన్నామలై వ్యాఖ్యలు ఇరు మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయంటూ సేలంకు చెందిన పర్యావరణ ప్రేమికుడు పీయూష్ మనుష్ సేలం కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణకు స్వయంగా హాజరుకావాలని కోర్టు అన్నామలైకు సమన్లు జారీచేసింది. ఈ సమన్లు వ్యతిరేకిస్తూ, తనపై మోపిన కేసు రద్దు చేయాలని కోరుతూ అన్నామలై తరఫున మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌లో... తన మాటలను వక్రీకరించారని అన్నామలై పేర్కొన్నారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్, అన్నామలై పిటిషన్‌ను తోసిపుచ్చడంతో పాటు ఆయనపై నమోదైన కేసు రద్దు చేసేందుకు నిరాకరించారు. అలాగే, చట్టానికి అనుగుణంగా సేలం కోర్టు విచారణ చేపట్టవచ్చని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

వేచి చూడండి

మెగా కూటమి ఏర్పాటు తథ్యం ● నామక్కల్ జిల్లాలో ఈపీఎస్



కుమారపాళయం సభలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఎవరూ ఊహించని రీతిలో బలమైన మెగా కూటమిని ఏర్పాటు చేస్తానని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) శపథం చేశారు. నామక్కల్ జిల్లా కుమారపాళయంలో గురువారం ఉదయం అన్నాడీఎంకే ఆధ్వర్యంలో తిరుచెంగోడు, పరమత్తివేలూరు, కుమారపాళయం శాసనసభ నియోజకవర్గాలకు చెందిన సమాచార సాంకేతిక విభాగం నిర్వాహకుల సమావేశంలో పాల్గొన్న ఆయన ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ బద్ధశత్రువైన డీఎంకేని చిత్తుగా ఓడించేందుకు పార్టీ శ్రేణులంతా తీవ్రంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి స్టాలిన్ తన చేతగానితనాన్ని బహిర్గతం కాకుండా అదేపనిగా అన్నాడీఎంకేపై, పార్టీ నేతలపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన పథకాలన్నింటికీ డీఎంకే స్టిక్కర్లు అతికించి ఆ పథకాలను తామే రూపొందించి అమలు చేసినట్లు ప్రజలను మోసగిస్తోందన్నారు. ఈ సభకు హాజరైన వారిలో ముప్పావు శాతం మంది యువత ఉన్నారని, వీరి భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దటమే తమ పార్టీ ఆశయమన్నారు. సామాజిక ప్రసారమాధ్యమాల ద్వారా డీఎంకే ప్రభుత్వ అవినీతి ఎండగట్టేలా పార్టీ సాంకేతిక విభాగం శ్రమించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రజలంతా అన్నాడీఎంకేని గెలిపించేందుకు సిద్ధమవుతున్నారని, లోక్‌సభ ఎన్నికలు, తర్వాత జరగబోయే శాసనసభ ఎన్నికలలో పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఈపీఎస్ ధీమా వ్యక్తం చేశారు.

ఇండియా కూటమికి బీటలు...

ఇండియా కూటమిలో ముఖ్యమంత్రి స్టాలిన్ చేరినప్పటి నుండి ఆ కూటమిలో నేతల మధ్య వివాదాలు అధికమయ్యాయని, ప్రస్తుతం కారు చక్రాలు విరిగిపడినట్లు ఇండియా కూటమిలోని పార్టీలన్నీ వైదొలగుతున్నాయని ఈపీఎస్ విమర్శించారు.

స్టాలిన్ స్పెయిన్ పర్యటనపై శ్వేతపత్రం...

నగరంలో జనవరి మొదటివారంలో జరిగిన అంతర్జాతీయ పెట్టుబడిదారుల మహానాడుకు స్పెయిన్ కంపెనీల ప్రతినిధులను ఆహ్వానించి ఉంటే ఒప్పందాలు కుదుర్చుకుని ఉంటారని, అయితే స్టాలిన్ ఆ పని చేయకుండా పనిగట్టుకుని ఆ దేశంలో పర్యటించం పలు అనుమానాలకు తావిచ్చే విధంగా ఉందని ఈపీఎస్ ధ్వజమెత్తారు. ఈ మేరకు గురువారం సాయంత్రం విడుదల చేసిన ప్రకటనలో స్పెయిన్ పర్యటనలో రూ.3440 కోట్ల మేరకు పెట్టుబడులు సమీకరించినట్లు గొప్పలు చెప్పుకుంటున్న స్టాలిన్ ఒప్పందాలు కుదుర్చుకున్న కంపెనీలలో రెండు కంపెనీలు రాష్ట్రంలోనే ఉన్నాయనే విషయాన్ని మరచిపోయారని చెప్పారు. ఏది ఏమైనప్పటికీ స్టాలిన్ స్పెయిన్ పర్యటనపై సమగ్రమైన వివరాలతో శ్వేతపత్రం జారీ చేయాలని ఈపీఎస్ డిమాండ్ చేశారు.

అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయసేకరణ

● మంత్రి ఉదయనిధి ప్లాన్

అడయార్, ఫిబ్రవరి 8: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో డీఎంకే కూటమి అభ్యర్థుల గెలుపోటములపై యువజన విభాగానికి చెందిన కీలక నేతల నుంచి అభిప్రాయసేకరణ చేపట్టాలని డీఎంకే యువజన విభాగం అధ్యక్షుడు, రాష్ట్ర మంత్రి ఉదయనిధి భావిస్తున్నారు. ఇందుకోసం ఈ సమాలోచనల సమావేశాలు తేనాంపేటలోని యువజన విభాగం ప్రధాన కార్యాలయమైన అన్బాలయంలో నిర్వహించేలా ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే, లోక్‌సభ ఎన్నికల కోసం అభ్యర్థుల ఎంపిక, నియోజకవర్గాల్లో పార్టీతో పాటు మిత్రపక్షాల గెలుపోటములపై ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ 'ఎలక్షన్ ఆర్గనైజింగ్ కమిటీ'ని ఏర్పాటుచేశారు. ఇందులో పార్టీ సీనియర్ నేతలు కేఎన్ నెహ్రూ, ఆర్ఎస్ భారతి, ఏవీ వేలు, తంగం తెన్నరసు, ఉదయనిధిలకు చోటుకల్పించారు. ఈ కమిటీ గత నెల 28వ తేదీ నుంచి నియోజకవర్గాల వారీగా నేతలను ఆహ్వానించి అభిప్రాయాలను సేకరిస్తుంది. అదేవిధంగా యువజన విభాగానికి చెందిన నేతల నుంచి అభిప్రాయాలను తెలుసుకోవాలని మంత్రి ఉదయనిధి భావిస్తున్నారు. ఈ విభాగంలో దాదాపు 650 మంది ఆర్గనైజర్లు ఉండగా, వీరిని దశలవారీగా నగరానికి పిలిపించి అభిప్రాయాలను తెలుసుకోవాలని, ఇందుకోసం అన్బాలయంలో ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం.

సెంథిల్‌బాలాజీపై మళ్లీ ఈడీ పంజా

● కరూరు నివాసంలో తనిఖీలు



తనిఖీలు జరిగిన కరూరులో సెంథిల్ బాలాజీ నివాసం

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి సెంథిల్ బాలాజీపై మళ్లీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం (ఈడీ) పంజా విసిరింది. కరూరులోని ఆయన నివాసంలో ఈడీ అధికారులు గురువారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కరూరు జిల్లా మనమంగళం సమీపం రామేశ్వరపట్టిలో సెంథిల్‌బాలాజీకి చెందిన నివాసంలో సెంథిల్‌బాలాజీ తల్లిదండ్రులు నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో ఐదుగురు ఈడీ అధికారులు వెళ్లి సోదాలు జరిపారు. సెంథిల్‌బాలాజీ గది తాళాలు తెప్పించుకుని అధికారులు తనిఖీ చేశారు. ఆ తర్వాత సెంథిల్ బాలాజీ తల్లిదండ్రులను కూడా ప్రశ్నించారు. సెంథిల్‌బాలాజీ తమ్ముడు శంకర్ కోసం అడిగారు. ఆ వివరాలు తెలియవని వారు బదులిచ్చారు. సాధారణంగా ఈడీ అధికారులు తనిఖీలకు వెళ్లేటప్పుడు పారిశ్రామిక భద్రతాదళాన్ని కాపలాగా తీసుకొని వెళ్లటం ఆనవాయితీ. అయితే ఈడీ అధికారులు స్థానిక పోలీసులకు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, సీఆర్పీఎఫ్ భద్రత లేకుండా ఈ తనిఖీలు నిర్వహించారు.

ద్రావిడ తరహా పాలనలో ఎవరు తప్పు చేసినా కఠిన చర్యలు

● మంత్రి పీకే శేఖర్‌బాబు

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ద్రావిడ తరహా పాలనలో ఎవరు తప్పు చేసినా కఠిన చర్యలు తప్పవని దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు హెచ్చరించారు. గురువారం మధురవాయల్ మార్గకాల ఈశ్వరాలయంలో రూ. 39.58 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఆ సందర్భంగా ఆయన విలేఖరులతో మాట్లాడుతూ డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఆలయాలన్నీ కొత్త శోభ సంతరించుకున్నాయని, ప్రాచీన ఆలయాలకు మహాకుంభాభిషేకాలు జరిపించి, నిత్యపూజలు నిర్వహించేందుకు కూడా నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. మైలాపూరు కపాలీశ్వరాలయం ఎదుట ఎవరో చిత్తుకాగితాలకు నిప్పంటించారని, సీసీ వీడియో దృశ్యాల ఆధారంగా ఆ వ్యక్తిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ మంత్రిత్వశాఖలలో ఎలాంటి తప్పిదాలు జరుగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని చెప్పారు. దేవాదాయ శాఖలో కబ్జాలకు గురైన ఆస్తులను స్వాధీనం చేసుకోవడం పట్ల ఆయన హర్షం ప్రకటించారని తెలిపారు.

సమాచార ధ్వని

11 వరకు చిన్మయ మిషన్ ఆధ్యాత్మిక ఉపన్యాసాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: ప్రపంచవ్యాప్తంగా చిన్మయ మిషన్ కేంద్రాల్లో స్వామి చిన్మయానంద 108వ జయంతి మహోత్సవాలు ఈ ఏడాది ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఆధ్యాత్మిక ఉపన్యాస కార్యక్రమాలు ఈ నెల 11వ తేది వరకు నిర్వహించనున్నారు. ఈషా వాశ్య ఉపనిషంపై ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ప్రతిరోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.15 గంటల వరకు జరుగనున్నాయి.

రూ.40 లక్షలతో మహిళల జిమ్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: స్థానిక జాఫర్‌ఖాన్‌పేటలో రూ.40 లక్షలతో మహిళల కోసం వ్యాయామశాల ఏర్పాటుచేయనున్నారు. 139వ వార్డు కౌన్సిలర్ అభివృద్ధి నిధులతో ఆర్ఆర్ కాలనీ 3వ వీధిలో జిమ్, యోగా కేంద్రం ఏర్పాటుకుగాను భూమి పూజ బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సుబ్రమణి, మండల ఇంజనీర్ పాల్గొన్నారు.

16న ఈఎస్ఐ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: ఈఎస్ఐ లబ్ధిదారులకు ఈ నెల 16వ తేది సమస్యల పరిష్కార ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు కార్మికుల ప్రభుత్వ బీమా సంస్థ తెలిపింది. ఈ సంస్థ చెన్నై మండల కార్యాలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరుగనున్న గ్రీవెన్స్‌లో, లబ్ధిదారులు పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రెడ్‌హిల్స్: సోత్తుపెరంబేడు, కారనోడై, ఆత్తూర్, దేవనేరి, కమ్మవారిపాళయం, కేవీటీ అవెన్యూ, చోలిపాళయం, పెరియ కాలని. **అంబత్తూర్:** మేనాంబేడు, ఒరగడం, ఎస్వీ నగర్, గాంధీ మెయిన్ రోడ్డు, పసుమ్ పొన్ రోడ్డు. **పోరూర్:** కావనూరు ఆర్ఈ నగర్, శివకలత్తూర్, సరస్వతి నగర్, గలితిపేట్, మణిమంగళం రోడ్డు, పెరియార్ నగర్, పుదుపేడు, రామాపురం వెంకటేశ్వర నగర్ 2,3 మెయిన్ రోడ్డు, వెంకటేశ్వర 3,11,12,17వ వీధులు. **కేకే నగర్:** రామస్వామి రోడ్డు, రాజమ్మాళ్ రోడ్డు, లక్ష్మణస్వామి రోడ్డు, ఆర్కే షణ్ముగం రోడ్డు, నెసపాక్కం, పీటీ రాజన్ రోడ్డు, అశోక్ నగర్ 1,9,11 అవెన్యూలు, 80 అడుగుల రోడ్డు. **గిండీ:** రామాపురం, మొగలివాక్కం, లలితాంబాళ్ నగర్, శాంత నగర్, అయ్యపాళయం, నందంబాక్కం, కోలపాక్కం శ్రీరామ్ గార్డెన్, ఇందిరా నగర్, పిల్లయార్ ఆలయ వీధి, బెల్ నగర్, ధర్మరాజపురం సీఆర్ఆర్ పురం, ఎల్ అండ్ టికాలని, ఎంజీ రోడ్డు, ఎంజీఆర్ నగర్

ఐటీ కారిడార్: వెంకటేశ్వర నగర్ 1వ మెయిన్ రోడ్డు, 10వవీధి, పాండియర్ నగర్, అరింజర్ అన్నా నగర్

అడయార్: తిరువాన్మియూర్, కామరాజర్ నగర్ 1,2,3 వీధులు, వెస్ట్ అవెన్యూ, కామరాజ్ నగర్ 1వ మెయిన్ రోడ్డు, రంగనాధపురం, పెరియార్ నగర్, వళ్లువర్ నగర్, పెరుంగుడి, ఉద్దండి, నీలాంగరై, వైద్యలింగం 1,2,3 క్రాస్ వీధులు, న్యూ గణేశ్ 1 నుంచి 5 వీధులు, రాజేంద్ర నగర్ 1 నుంచి 10 వీధులు, కదిరవన్ రోడ్డు, నారాయణన్ స్కూల్, ఈసీఆర్ పోలీస్‌స్టేషన్

తాంబరం: మాడంబాక్కం, ఆనంద నగర్, పార్క్ వీధి, సుశీల నగర్, బాలాజీ నగర్, అన్బు నగర్, వేంగై వాసల్ మెయిన్ రోడ్డు, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, ఆంజనేయర్ ఆలయ వీధి, ఇందిరా నగర్, శ్రీరామ్ నగర్, కన్నదాసన్ అవెన్యూ, పళ్లికరనై, కాగితపు పురం, ఎస్. కొళత్తూర్, భాగ్యలక్ష్మి నగర్, రాజా నగర్, కృష్ణా నగర్, భవానీ వీధి, లెటర్ లైన్, ఆఫీసర్స్ లైన్, న్యూ సంత రోడ్డు, పెరుంబాక్కం, షోలింగనల్లూర్, ఏరికరై రోడ్డు, వేళచ్చేరి మెయిన్ రోడ్డు, రంగనాధపురం, పుదునగర్, మసీదు వీధి, పల్లావరం రాజాజీ నగర్, ఈశ్వరి నగర్, శక్తి నగర్, గణపతి నగర్, సరోజిని నగర్.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: స్థానిక టి.నగర్, వ్యాసర్పాడి ప్రాంతాల్లో విద్యుత్ గ్రీవెన్స్ శుక్రవారం జరుగనుంది. నుంగంబాక్కం వళ్లువర్‌కొట్టం సమీపంలో ని ఇంజనీర్ కార్యాలయంలో టి.నగర్ పరిధిలోని వారు, వ్యాసర్పాడి రామలింగర్ ఆలయం ఎదుట ఉన్న ఇంజనీర్ కార్యాలయంలో ఆ ప్రాంతానికి చెందినవారు హాజరై తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

420 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: రైతుల నుంచి 420 మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్ర విద్యుత్ బోర్డు తెలిపింది. రైతులు తమ భూముల్లో ఒంటరిగాను, బృందంగాను ఏర్పాటుచేసిన సోలార్ విద్యుత్ కేంద్రాల నుంచి ప్రభుత్వం ఒక యూనిట్ రూ.3.28 చొప్పున కొనుగోలు చేస్తోంది. వేసవి అవసరాల కోసం త్వరలో రైతుల నుంచి 420 మెగావాట్లు విద్యుత్ కొనుగోలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

టాన్సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: టాన్సెట్ ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువును ఈ నెల 12 వరకు పొడిగించారు. రాష్ట్రప్రభుత్వ విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలల్లో ఎంబీ ఏ, ఎంసీఏ, ఎంఈ, ఎంటెక్, ఎంఆర్క్, ఎంప్లాన్ కోర్సుల్లో చేరేందుకు టాన్సెట్, సీటా ప్రవేశ పరీక్షల్లో ఏదైనా ఒకటి ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. వచ్చే విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించిన ప్రవేశ పరీక్ష మార్చిలో జరుగనుంది. ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ గడువు ముగిసిన నేపథ్యంలో, 12వ తేది వరకు దరఖాస్తులు సమర్పించవచ్చని అన్నా విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

ఏవీఎం శ్మశానవాటిక మూసివేత

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: స్థానిక కోడంబాక్కం మండలం ఏవీఎం శ్మశానవాటికలో దహన వేదిక పర్యవేక్షణ పనులు జరుగనుండడంతో ఈ నెల 27వ తేది వరకు శ్మశానవాటిక మూసివేయనున్నట్లు కార్పొరేషన్ తెలిపింది. పనులు ముగిసే వరకు సమీపంలో ఉన్న నెసపాక్కం, కన్నమ్మపేట శ్మశానవాటికలు వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందజేసే శిబిరం ఏడు మండలాల్లో జరుగనుంది. ట్రై సైకిళ్లు, వీల్‌చైర్, కాలిబర్, ఆధునిక కృత్రిమ కాళ్లు, చేతులు, వినికిడి పరకరాలు వంటివి అందజేసేందుకు లబ్ధిదారుల ఎంపిక శిబిరం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరు జరుగనుంది. ఈ నెల 20వ తేది అడయార్ మండలం ఆలందూర్ కోట్టూరుపురం సెయింట్ లూయీస్ మహోన్నత పాఠశాల, 21న తేనాంపేట మండలంలోని బధిరుల ప్రత్యేక పాఠశాల, 22న కోడంబాక్కం మండలంలోని కేకే నగర్ రాష్ట్ర అటవీ శిక్షణ కేంద్రం, 23న షోలింగనల్లూర్ మండలం తరమణిలో ఉన్న స్పాస్టిక్ సొసైటీ ఆఫ్ తమిళనాడులో జరుగనున్న ఈ శిబిరాల్లో పాల్గొనాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.

గృహ సముదాయాలు ప్రారంభం

వేలూరు, ఫిబ్రవరి 8: కాట్పాడి డివిజన్ కరిగిరి ప్రాంతంలో తమిళనాడు నగర ప్రాంత జీవనాధార అభివృద్ధి సంస్థ తరఫున రూ.42.56 కోట్లతో నిర్మించిన 400 కొత్త గృహాల (ప్లాట్ సిస్టమ్) సముదాయాన్ని గురువారం రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్ ప్రారంభించారు. అలాగే, పలువురు లబ్ధిదారులకు గృహాల కేటాయింపు పత్రాలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుబ్బలక్ష్మి, జిల్లా పంచాయతి కమిటీ అధ్యక్షుడు బాబు, కార్పొరేషన్ మేయర్ సుజాత, ఉప మేయర్ సునీల్‌కుమార్, ఇంజనీర్ సెంథిల్ మురుగ జయకుమార్, కాట్పాడి యూనియన్ కమిటీ అధ్యక్షుడు వేల్‌మురుగన్, 1వ మండల కమిటీ అధ్యక్షులు పుష్పలత, ఉపాధ్యక్షుడు శరవణన్, రెవెన్యూ తహసీల్దార్ కవిత తదితరులు పాల్గొన్నారు.



గృహ సముదాయాలు ప్రారంభిస్తున్న మంత్రి దురైమురుగన్

రూ.86 లక్షలతో వీధి లైట్ల ఏర్పాటు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: స్థానిక తండయార్‌పేటలో రూ.86 లక్షలతో వీధి దీపాలు, తాగునీటి పైప్‌లైన్ కనెక్షన్ పనులు ప్రారంభమయ్యాయి. ఆర్కే నగర్ నియోజకవర్గం తండయార్‌పేట కరుణానిధి నగర్ ప్రాంతంలో 40 ఏళ్ల క్రితం అమర్చిన తాగునీటి పైప్ లైన్ నుంచి నీరు సక్రమంగా రావడం లేదు. అలాగే, విద్యుద్దీపాలు కూడా లేకపోవడంతో స్థానికులు కార్పొరేషన్‌కు విజ్ఞప్తి చేశారు. వారి కోరిక మేరకు రూ.75 లక్షలతో తాగునీటి పైప్ లైన్ల ఏర్పాటు, రూ.11 లక్షలతో వీధి దీపాల ఏర్పాటుపనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులు త్వరలో ముగించాలని ఒప్పందదారులకు ఆదేశాలు జారీచేసినట్లు అధికారులు తెలిపారు.

ఏడు ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు

ఐసిఎఫ్, ఫిబ్రవరి 8: రాష్ట్రంలోని ఏడు ప్రధాన ఆలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు దేవాదాయ శాఖ నిర్ణయించింది. స్థానిక పురుషవాక్కం గంగాదీశ్వర ఆలయం, నంగనల్లూర్ ఆంజనేయ స్వామి ఆలయం, పెరియపాళయం భవాని అమ్మన్ ఆలయాలకు కొత్త బంగారు రథ పనులు జరుగుతున్నాయి. గత ఏడాది నిర్వహించినట్లే ఈ ఏడాది మహాశివరాత్రి ఉత్సవాలు మైలాపూర్ కపాలీశ్వర ఆలయం, తిరువణ్ణామలై అరుణాచలేశ్వర ఆలయం, తంజావూరు బృహదీశ్వర ఆలయం, తిరునల్వేలి నెల్లయప్పర్ ఆలయం, పేరూర్ పట్టీశ్వర ఆలయం, మదురై మీనాక్షి సుందరేశ్వర స్వామి ఆలయం, తిరువానైకావల్ జంబుకేశ్వర ఆలయాల్లో నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు దేవాదాయ శాఖ తెలిపింది.

తంజై ఆలయంలో చిత్తిరై తిరువిళా

● ముహూర్త స్తంభ స్థాపన

అడయార్, ఫిబ్రవరి 8: తంజావూరులోని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బృహదీశ్వర ఆలయం (పెరియ కోయిల్)లో చిత్తిరై తిరువిళా వార్షిక ఉత్సవాలు ఏప్రిల్ 6 నుంచి ప్రారంభంకానున్నాయి. వీటిని పురస్కరించుకుని ముహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం గురువారం జరిగింది. ఏప్రిల్ 6వ తేదీ ప్రారంభమయ్యే ఈ వార్షిక వేడుకలు 23వ తేదీ వరకు 18 రోజులపాటు జరుగుతాయి. ఈ వేడుకల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ఏప్రిల్ 20వ తేదీ నిర్వహిస్తారు.

రాష్ట్రానికి అదనంగా ముగ్గురు ఎన్నికల పర్యవేక్షకులు

పెరంబూర్, ఫిబ్రవరి 8: రాష్ట్రానికి అదనంగా ముగ్గురు ఎన్నికల అధికారులను నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రానికి అదనపు చీఫ్ ఎలక్టోరల్ అధికారిగా ఐఏఎస్ అధికారి శంకర్‌లాల్ కుమావత్, జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ అధికారులుగా ఐఏఎస్ అధికారులు శ్రీకాంత్, అరవిందన్ నియమితులయ్యారు.

నేడు నగరం నుంచి 500 ప్రత్యేక బస్సులు

పెరంబూర్, ఫిబ్రవరి 8: వారాంతపు సెలవు రోజులను పురస్కరించుకొని నగరం, ఇతర ప్రాంతాల నుంచి 500 ప్రత్యేక బస్సులు నడుపనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. మోహన్ విడుదల చేసిన ప్రకటనలో... వారాంతపు రోజులైన శనివారం (ఈ నెల 10వ తేది), ఆదివారం (11వ తేది-శుభముహూర్తాల రోజు) సందర్భంగా చెన్నై సహా ఇతర ప్రాంతాల నుంచి అదనపు బస్సులు నడుపనున్నామన్నారు. ఆ ప్రకారం, కిలంబాక్కం నుంచి తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు, కోయంబేడు నుంచి నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు శుక్రవారం (ఈ నెల 9వ తేది) రోజూ నడిపే బస్సులతో పాటు అదనంగా 300 ప్రత్యేక బస్సులు, బెంగుళూరు నుంచి ఇతర ప్రాంతాలకు మరో 200 బస్సులు మొత్తం 500 బస్సులు నడుపనున్నామని తెలిపారు. అలాగే, సెలవులు ముగించుకొని తిరిగి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం అవసరమైన ప్రాంతాల నుంచి అదనపు బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ ఎండీ తెలిపారు.

ఎన్ఐఏ ఎదుట ఇద్దరు ఎన్‌టీకే నేతల హాజరు

అడయార్, ఫిబ్రవరి 8: స్థానిక పురసైవాక్కంలోని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) కార్యాలయంలో నామ్ తమిళర్ కట్చి (ఎన్‌టీకే)కి చెందిన ఇద్దరు నేతలు గురువారం హాజరయ్యారు. ఆ పార్టీకి చెందిన ఇళైంజర్ పాసరై విభాగం నిర్వాహకులైన ఇడుప్పావనం కార్తీక్, తెన్నగం విష్ణు ఈ కార్యాలయానికి వచ్చారు. వీరిని ఎన్ఐఏ అధికారులు విచారణ జరిపారు. ముఖ్యంగా ఓమలూరులోని నమోదైన ఒక కేసులో భాగంగానే ఎన్ఐఏ అధికారులు నామ్ తమిళర్ కట్చికి చెందిన నేతలు, కార్యాలయంలో సోదాలు జరిగిన విషయం తెల్సిందే. ఈ తనిఖీల్లో విదేశీ నిధులు పొందుతున్న విషయాన్ని పసిగట్టి.. ఆ పార్టీకి చెందిన కీలక నేత సాట్టై మురుగన్‌ను విచారించారు. కాగా, ఈ పార్టీకి చెందిన నేతల వద్ద రెండో రోజు జరిపిన విచారణలో అనేక విషయాలు రాబట్టినట్టు తెలుస్తుంది.

వైభవంగా బాలమురుగన్ స్వామి జన్మదిన వేడుకలు



భక్తులను ఆశీర్వదిస్తున్న బాలమురుగన్ అడిమై స్వామి

వేలూరు, ఫిబ్రవరి 8: రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వామి బాలమురుగన్ ఆలయం నిర్మించి, పలు దైవిక పనులు నిర్వహిస్తున్నారు. బాలమురుగన్ అడిమై స్వామి పుట్టిన రోజు సందర్భంగా రత్నగిరి కొండపై ఉన్న బాల మురుగన్, వల్లి, దేవసేన అమ్మవార్లకు విశేష అభిషేకాలు, పూజలు, మహా దీపారాధన నిర్వహించారు. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొని బాలమురుగన్ అడిమై స్వాముల ఆశీస్సులందుకున్నారు. కార్యక్రమంలో కలవై సచ్చిదానంద స్వాములు సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ఆందోళన

అడయార్, ఫిబ్రవరి 8: రాష్ట్రాల హక్కులను హరించేలా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ కరూర్, మైలాడుదురై, అరియలూరు ప్రాంతాల్లో పోస్టాఫీసుల ఎదుట ఉభయ కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో డీఎంకే కూటమి పార్టీల నేతలు గురువారం ఆందోళన చేశారు. కరూర్ జిల్లా కేంద్రంలోని పోస్టాఫీసు ఎదుట జరిగిన ఆందోళన సీపీఎం సభ్యుడు జీవానందం నేతృత్వంలో జరిగింది. అలాగే, అరియలూరు బస్టాండు సమీపంలో ఉన్న అన్నా విగ్రహం వద్ద జరిగిన ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఇళంగోవన్ నాయకత్వం వహించారు. ఇందులో డీఎంకే, ఎండీఎంకే నేతలతో పాటు డీఎంకే కూటమి నేతలు పాల్గొన్నారు. మైలాడుదురై బస్టాండు వద్ద జరిగిన ఆందోళనలో జిల్లా కార్యదర్శి శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగింది. రాష్ట్రాల హక్కులను పరిరక్షించే విధంగాను, రాష్ట్రాల్లోని గవర్నర్ల ద్వారా ప్రభుత్వ కార్యకలాపాల్లో జోక్యం చేసుకునేలా, ప్రజా ప్రభుత్వాల నిర్ణయాలను వ్యతిరేకించేలా కేంద్రంలోని బీజేపీ పాలకులు వ్యవహరిస్తున్నారని ఆందోళనల్లో పాల్గొన్న నేతలు ఆరోపించారు.



అన్నాడీఎంకే మేనిఫెస్టో కమిటీలో పాల్గొని సలహాలు, సూచనలిచ్చిన వీఐటీ వర్శిటీ చాన్సలర్ విశ్వనాథన్‌కు పుష్పగుచ్చం అందిస్తున్న పార్టీ మానగర జిల్లా సెక్రటరీ ఎస్సార్కే అప్పు

తదుపరి ప్రధాని ఎవరా అని ప్రపంచ దేశాల ఆతృత...!

● అన్నాడీఎంకే నేత కేపీ మునుస్వామి

పెరంబూర్, ఫిబ్రవరి 8: దేశ తదుపరి ప్రధాని ఎవరా? అని ప్రపంచ దేశాధినేతలు ఆతృతగా ఎదురుచూస్తున్నారని అన్నాడీఎంకే ఉప ప్రధాన కార్యదర్శి కేపీ మునుస్వామి తెలిపారు. కృష్ణగిరి జిల్లా బర్గూర్‌లో ఈ నెల 11న జరుగనున్న కార్యక్రమంలో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పాల్గొంటుండగా, ఈ సందర్భంగా పలు పార్టీల నేతలు ఆయన సమక్షంలో పార్టీలో చేరనున్నారు. పళనిస్వామి పర్యటన ఏర్పాట్లపై గురువారం స్థానిక నేతలతో సమావేశమైన కేపీ మునుస్వామి విలేఖరులతో మాట్లాడుతూ... పార్లమెంటు ఎన్నికలను ఎదుర్కొనేందుకు పార్టీ సిద్ధంగా ఉందన్నారు. దేశవ్యాప్తంగా పలు పార్టీలు కూటముల ఏర్పాట్లలో ఉన్నాయన్నారు. 'ఇండియా' కూటమి ఒకవైపు, ఎన్డీఏ కూటమి మరోవైపు ఉన్నాయన్నారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా భారత్ ఉందని, అందువల్ల రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో భారతదేశ ప్రధానిగా ఎవరు ఎన్నికవుతారు అని ప్రపంచ దేశాధినేతలు ఆతృతగా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ రెండు కూటములు మినహాయించి తమిళనాడు అభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం పాటుపడే వ్యక్తిని ప్రధానిగా ఎన్నుకొనేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఆ దిశగా పళనిస్వామి నేతృత్వంలో మెగా కూటమి ఏర్పాటుచేసి ప్రజల వద్దకు వెళ్లనున్నామన్నారు.

వైద్యకళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రం

● ఈసీకి హైకోర్టు మదురై బెంచ్ నోటీసు

పెరంబూర్, ఫిబ్రవరి 8: పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి మదురై వైద్యకళాశాలలో ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటుకు స్టే విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సోమవారంలోపు అఫిడవిట్ దాఖలుచేయాలని ప్రధాన ఎన్నికల కమిషన్‌ను హైకోర్టు మదురై బెంచ్ నోటీసు జారీచేసింది. మదురై వైద్యకళాశాల విద్యార్థుల సంఘం తరఫున రాజా మహమ్మద్ హైకోర్టు మదురై బెంచ్‌లో దాఖలుచేసిన పిటిషన్‌లో... ఈ కళాశాలలో సుమారు 4,000 మంది విద్యార్థినీ, విద్యార్థులు చదువుతున్నారని, ఈ ప్రాంగణంలో ఓట్ల లెక్కింపు కేంద్రం ఏర్పాటుతో విద్యార్థులు, ప్రొఫెసర్లు, సిబ్బందిని కళాశాల ప్రాంగణంలో, తరగతి గదుల్లోకి అనుమతించరని, దీనిని పరిగణంలోకి తీసుకొని లెక్కింపు కేంద్రం ఏర్పాటుకు స్టే విధించాలని పిటిషన్‌లో కోరారు.

రాష్ట్రానికి పదేళ్లలో రూ.10 లక్షల కోట్లు కేటాయింపు

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్

పెరంబూర్, ఫిబ్రవరి 8: తమిళనాడుకు పదేళ్లలో రూ.10 లక్షల కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం అందించిందని కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో తుఫాను, భారీవర్షాలకు నష్టపోయిన రాష్ట్రాన్ని ఆదుకొనేలా నివారణ నిధులు అందజేయని కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ గురువారం పార్లమెటు ప్రాంగణంలో డీఎంకే ఎంపీలు నల్లచొక్కాలు ధరించి ఆందోళన చేపట్టారు. డీఎంకే ఆరోపణలకు కేంద్ర మంత్రి మురుగన్ స్పందిస్తూ... డీఎంకే ఎప్పుడూ ప్రతీకార ఆటలు ఆడుతుందన్నారు. గత పదేళ్లలో రాష్ట్రాభివృద్ధి, సాంఘీక సంక్షేమ పథకాలకు రూ.10 లక్షల కోట్లను ప్రధాని నరంద్ర మోదీ అందజేశారని తెలిపారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యల నుంచి ప్రజల దృష్టి మరిల్చేలా డీఎంకే ప్రభుత్వం రాజకీయాలు చేస్తుందని, ప్రస్తుతం ఆ పార్టీపై రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, పార్లమెంటు ఎన్నికల్లో ఈ విషయం స్పష్టమవుతోందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు.

'మిచౌంగ్' తుఫాను బాధితుల్లో రేషన్‌కార్డు లేని వారికి త్వరలో సాయం

పెరంబూర్, ఫిబ్రవరి 8: గత ఏడాది డిసెంబరులో సంభవించిన 'మిచౌంగ్' తుఫాను కారణంగా చెన్నై, తిరువళ్లూర్, కాంచీపురం, చెంగల్పట్టు జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయి. తుఫాను బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తలా రూ.6,000 నివారణ సాయాన్ని రేషన్ దుకాణాల ద్వారా అందజేసింది. చెన్నై జిల్లాలో మాత్రమే 13.72 లక్షల కుటుంబాలు రూ.6 వేల సాయం అందుకున్నాయి. అదే సమయంలో, చక్కెర కార్డుదారులు, ఎలాంటి సరుకులు పొందలేని కార్డులు కలిగిన వారు, ఆదాయపు పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగులు, పొరుగు ప్రాంతాల నుంచి ఉపాధి కోసం ఇక్కడకు వచ్చి బస చేస్తున్న వారు తుఫానుతో నష్టపోయిన పక్షంలో నివారణ సాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. ఆ ప్రకారం, 5.5 లక్షల మంది తమ సమీప ప్రాంతాల్లోని రేషన్ దుకాణాల్లో దరఖాస్తులు సమర్పించారు. వాటిని పరిశీలించిన అధికారులు, వారిళ్లకే వెళ్లి కరెంట్ బిల్లు, ఆధార్ కార్డు, ఇంటి అద్దె ఒప్పంద పత్రం, గ్యాస్ బిల్ సహా పలు వివరాలు పరిశీలించారు. అనంతరం నాలుగు జిల్లాల కలెక్టర్లు తుది జాబితాను రాష్ట్రప్రభుత్వానికి పంపించారు. ఆ ప్రకారం, 5 లక్షల మంది ఈ సాయానికి అర్హులుగా గుర్తించిన ప్రభుత్వం, త్వరలో వారిని తలా రూ.6 వేలు అందించనుందని అధికారులు తెలిపారు.

నేడు డీఎండీకే ఉన్నతస్థాయి కమిటీ సమావేశం

పెరంబూర్, ఫిబ్రవరి 8: పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పలు పార్టీలు కూటముల ఏర్పాటుపై దృష్టి సారిస్తున్నాయి ఈ నేపథ్యంలో డీఎండీకే ఉన్నతస్థాయి కమిటీ సమావేశం శుక్రవారం జరుగనుంది. పార్లమెంటు ఎన్నికల్లో కూటమి ఏర్పాటుపై బుధవారం డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత జిల్లా కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఏ పార్టీ తాము ఆశించిన స్థానాలు కేటాయిస్తే ఆ కూటమిలో చేరుతామని ఈ సందర్భంగా ప్రేమలత తేల్చి చెప్పారు. ఈ నేపథ్యంలో, పార్లమెంటు ఎన్నికల్లో కూటమి ఏర్పాటుపై చర్చించేందుకు శుక్రవారం ప్రేమలత ఆధ్వర్యంలో నిర్వహించనున్న కమిటీ సమావేశంలో ప్రిసీడియం ఛైర్మెన్ ఇళంగోవన్, ఉప ప్రధాన కార్యదర్శి సుదీష్, పార్థసారధి తదితర ముఖ్య నిర్వాహకులు పాల్గొని, కూటమిపై నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాల సమాచారం.

కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ డీఎంకే వినూత్న నిరసన

పెరంబూర్, ఫిబ్రవరి 8: 'మిచౌంగ్', భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న జిల్లాలను ఆదుకొనేందుకు నిధులివ్వని బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా డీఎంకే నేతలు వినూత్న నిరసన చేపట్టారు. నగరం, తిరునల్వేలి సహా పలు ప్రాంతాల్లో డీఎంకే శ్రేణులు ప్రజలకు హల్వా అందజేయడంతో పాటు, 'రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ నివారణ సహాయం జీరో' అంటూ ముద్రించిన కరపత్రాలను అందజేశారు. తుఫాను బాధిత జిల్లాలను కేంద్ర మంత్రులు స్వయంగా పర్యటించినా, కేంద్ర బృందం నష్టాలను అంచనా వేసి కేంద్రానికి నివేదిక అందించినా, కేంద్రప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదని ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేసేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు డీఎంకే నేతలు తెలిపారు.

కరాటే పోటీల విజేతలకు బహుమతుల పంపిణీ

వేలూరు, ఫిబ్రవరి 8: జిల్లా రియో కోషిడోరియా కరాటే శిక్షణ పాఠశాల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి కరాటే పోటీలు జరిగాయి. కేవీ కుప్పం సమీపం వేపంగనేరి శ్రీనివాస ఏసీ మహాల్‌లో కరాటే మాస్టర్ వినోద్‌కుమార్ సారథ్యంలో ఈ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో చెన్నై, కాంచీపురం, ఆరణి, రాణిపేట, తిరుపత్తూర్, వేలూరు తదితర ప్రాంతాలకు చెందిన 600 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల విజేతలకు సినీ నటుడు భావా లక్ష్మణన్, పాఠశాల రాష్ట్ర అధ్యక్షుడు కుచేంద్రన్, సిలంబు శాఖ రాష్ట్ర అధ్యక్షుడు తవమణి తదితరులు బహుమతులు అందజేశారు.

బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త శాఖ ప్రారంభం

వేలూరు, ఫిబ్రవరి 8 స్థానిక కాట్పాడి రోడ్డులో బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్త శాఖ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా జనరల్ మేనేజర్ ముఖేష్ వర్మ పాల్గొని, జ్యోతి ప్రజ్వలనతో కార్యాలయం ప్రారంభించారు. కార్యక్రమం లో చెన్నై మండల మేనేజర్ ముత్తుకుమరన్, ఉప మేనేజర్ గౌరి రామచంద్రన్, ఉప జనరల్ మేనేజర్ శ్రీనాథ్ నంబూర్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సంఘ జనరల్ సెక్రటరీ అమరనాథ్, అధ్యక్షుడు జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నై ఎగ్మూరులోని రాజరత్తినం స్టేడియంలో గురువారం జరిగిన పోలీసుల ఎంపిక దేహదారుఢ్య పరీక్షకు హాజరైన అభ్యర్థులు

బిడ్డకు జన్మనిచ్చిన మైనర్ బాలిక!

అడయార్, ఫిబ్రవరి 8: స్థానిక దురైప్పాక్కంకు చెందిన ఓ పాఠశాల విద్యార్థిని బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన రెండు రోజుల క్రితం జరిగింది. ఈ ప్రాంతానికి చెందిన 16 యేళ్ళ బాలిక స్కూల్‌లో ప్లస్‌టూ చదువుతోంది. ఆమె మంగళవారం పాఠశాలకు వెళ్లగా తరగతి గదిలో ఉండగా ఆమెకు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తమ బంధువైన యువకుడికి సమాచారమిచ్చింది. ఆ యువకుడు వెంటనే వెళ్లి ఆ విద్యార్థినిని ట్రిప్లికేన్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్ళి, తర్వాత బాలిక తల్లిదండ్రులకు విషయం తెలిపాడు. దీంతో తల్లి ఆగమేఘాలపై ఆస్పత్రికి చేరుకోగా, బాలిక ఏడు నెలల గర్భవతి అని వైద్యులు చెప్పారు. ఈ లోగా ఆ బాలిక నెలల తక్కువ బిడ్డను ప్రసవించింది. ఈ సంఘటనపై ఆస్పత్రి సిబ్బంది తరమణి మహిళా పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఇదిలావుంటే, తన కుమార్తెను తల్లి ఆరా తీయగా, తమ సమీప బంధువు రిషి (20) అనే యువకుడితో తనకు రహస్యంగా వివాహమైందని, ఆ యువకుడు పెరంబలూరు జిల్లా కోనేరి పాలెళయం అరుంధతీయ వీధిలో ఉంటున్నట్టు వెల్లడించింది. దీంతో ఆ తల్లి విలపిస్తూ, స్పృహకోల్పోగా, ఆమెకు వైద్యులు వైద్యం అందించారు.

క్వారీలో చిక్కుకొని ఇద్దరి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 8: విల్లుపురం సమీపంలోని రాళ్ల క్వారీలో మట్టిచెరియలు విరిగిపడి ఇద్దరు కార్మికులు మృతిచెందారు. మయిలం సమీపం పెరుంబాక్కంలోని రాళ్ల క్వారీలో పేలుడు మందు ఉంచేందుకు గుంతలు తవ్వుతున్న సమయంలో మట్టి చెరియలు జారిపడగా, వాటి కింద ఇద్దరు కార్మికులు చిక్కుకున్నారు. దీనిని గమనించిన సహచరులు ప్రొక్లయన్ ద్వారా మట్టి తొలగించి కార్మికులను రక్షించేందుకు ప్రయత్నించారు. మట్టి పైన పడడంతో ఊపిరాడక ఇద్దరు మృతిచెందగా, వారి మృతదేహాలు వెలికితీశారు. మృతులు ఇరైయనూర్‌కు చెందిన అయ్యనార్ (26), సేలంకు చెందిన రాజేంద్రన్ (30)గా గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించిన పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొనసాగుతున్న లంక నావికాదళం ఆగడాలు

● 19 మంది రామేశ్వరం జాలర్ల అరెస్టు

పెరంబూర్, ఫిబ్రవరి 8: రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా సరిహద్దులు దాటారంటూ రామేశ్వరానికి చెందిన 19 మంది జాలర్లను అరెస్ట్ చేయడంతో పాటు వారికి చెందిన రెండు పడవలను లంక నావికాదళం స్వాధీనం చేసుకుంది. రామనాథపురం జిల్లా రామేశ్వరం నుంచి బుధవారం ఉదయం 450 ఫైబర్ పడవల్లో సుమారు 3,500 మంది జాలర్లు మత్స్యశాఖ అనుమతులతో చేపల వేటకు సముద్రంలోకి వెళ్లారు. అర్థరాత్రి కచ్చాదీవి-నెడుదీవి మధ్యలోని భారత సరిహద్దు ప్రాంతంలో జాలర్లు చేపలు పడుతున్నారు. ఆ సమయంలో శ్రీలంక నావికాదళానికి చెందిన గస్తీ బోట్లు ఆ ప్రాంతానికి చేరుకున్నాయి. వారిని చూసి బెదిరిన జాలర్లు, సముద్రంలో వేసిన వలలను తీసుకొని అక్కడి నుంచి వెనక్కి తిరిగారు. వారిని వెంబడించిన లంక నావికాదళం పడవలో రాళ్లు రువ్వుతూ దాడులు చేసింది. వారిలో రామేశ్వరానికి చెందిన రీగన్, శశికుమార్‌లకు చెందిన రెండు ఫైబర్ పడవలను నావికాదళం స్వాధీనం చేసుకుంది. పడవల్లో ఉన్న మోట్టన్, అంతోని టిస్మర్, మునియస్వామి, జేసురాజా రశేఖర్, క్లవర్‌సన్, ప్రసాద్, ప్రభాకరన్, సెల్వరాజ్, సెల్వథామస్, ఆరోగ్యం, అశ్వార్డ్ సహా 19 మందిని అరెస్ట్ చేసి కాంగేశం హార్బర్‌కు తరలించారు. వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించే అవకాశముందని తిరిగి వచ్చిన జాలర్లు మత్స్యశాఖ అధికారులకు తెలియజేశారు.

తిరువేర్కాడు ఆలయంలో చోరీ

● పూజారిపై కేసు నమోదు

పెరంబూర్, ఫిబ్రవరి 8: స్థానిక తిరువేర్కాడు కరుమారి అమ్మన్ ఆలయంలో అమ్మవారి మెడలో ఉన్న 8 సవర్ల మంగళసూత్రం చోరీ వ్యవహారంలో అదృశ్యమైన పూజారిపై తిరువేర్కాడు పోలీసులు కేసు నమోదుచేశారు. రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన అమ్మవారి ఆలయాల్లో తిరువేర్కాడు దేవి కరుమారియమ్మన్ ఆలయ ఒకటి. ఈ నేపథ్యంలో, ఉత్సవమూర్తి అమ్మవారి మెడలో వేసిన 8 సవర్ల మంగళసూత్రం ఈ నెల 5వ తేది కనిపించడం లేదని ఆలయ పూజారులు ఆలయ నిర్వాహకులకు తెలియజేశారు. ఈ విషయమై పోలీసులు విచారించగా ఆలయంలో తాత్కాలిక అర్చకుడిగా పనిచేస్తున్న షణ్ముగం అలియాస్ బాబు (40) ఈ నగ దొంగిలించినట్లు, పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలుసుకొని కుదువబెట్టిన నగను మళ్లీ విడిపించి అమ్మవారికి వేసినట్లు తెలిసింది. దినసరి వేతనంపై అర్చకుడిగా పనిచేస్తున్న షణ్ముగంకు ఇంకా వివాహం కాలేదని, పలువురి వద్ద అప్పులు చేశాడని తెలుసుకున్న పోలీసులు అతనిపై కేసు నమోదుచేసి, పరారీలో ఉన్న అతని కోసం గాలిస్తున్నారు.

అన్నానగర్‌లో అర్ధరాత్రి ఎగిరిన డ్రోన్లు

పోలీసుల విచారణ

అడయార్, ఫిబ్రవరి 8: స్థానిక అన్నా నగర్ 'ఎన్' బ్లాక్ ప్రాంతంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని ఇద్దరు యువకులు డ్రోన్ ఎగురవేశారు. వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, వారు ద్విచక్రవాహనంపై పారిపోయారు. ఈ డ్రోన్ ఎగురవేసిన వ్యవహారం పోలీసుల దృష్టికి వెళ్ళింది. దీంతో ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తూ, గుర్తు తెలియని వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. ఈ 'ఎన్' బ్లాకులోని ఒక ఇంటి పడక గది కిటికీ సమీపానికి ఈ డ్రోన్ వెళ్ళడంతో ఆ శబ్దానికి ఆ ఇంటిలో నిద్రిస్తున్న వారితో పాటు చట్టుపక్కల వారు కూడా మేల్కొన్నారు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు ఒక ద్విచక్రవాహనం వద్ద నిలబడి, ఉండడం గమనించారు. ఆ తర్వాత వారిని పట్టుకునేందుకు స్థానికులు ప్రయత్నించగా వారు పారిపోయారు. అయితే, ఈ ఘటనపై స్థానికులు ఎవ్వరూ పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. కానీ, పోలీసులకు సమాచారం చేరడంతో వారు రంగంలోకి దిగి విచారణ జరుపుతున్నారు.

కుమరి తీరంలో రాముడి జెండా తొలగింపు



రాముడి జెండా ఏర్పాటు (పక్క చిత్రంలో) జెండా తొలగించిన దృశ్యం

పెరంబూర్, ఫిబ్రవరి 8: కన్నియాకుమారి సముద్రం మధ్యలో వివేకానంద్ రాక్ సమీపంలో ఏర్పాటుచేసిన రాముడి జెండాను వివాదాస్పదం కావడంతో రాత్రికి రాత్రే తొలగించారు. అయోధ్య రామాలయంలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ ఇటీవల జరిగిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా కన్నియాకుమారి జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో త్రివేణి సంగమంలో వివేకానంద రాక్ సమీపంలోని ఒక రాతిపె కమ్మీ ఏర్పాటుచేసి దానిపై రాముడి చిత్రంతో కూడిన కాషాయ జెండా ఎగురవేశారు. ఈ జెండా ఏర్పాటుపై పలు సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మంగళవారం రాత్రి పోలీసులు తొలగించారు. కానీ, బుధవారం ఉదయం మళ్లీ ఇనుప కమ్మీపై జెండా ఏర్పాటుచేయగా, దానిని పోలీసులు తొలగించారు. అలాగే, ఈ ప్రాంతంలో మళ్లీ జెండా పెట్టకుండా పోలీసులు పర్యవేక్షిస్తున్నారు.

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

● అంతర్జాతీయ సదస్సులో డా.ఉషా నటేశన్



అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న విదేశీ ప్రతినిధులతో డా.బాబూ మనోహర్, ఉషా నటేశన్ తదితరులు

ప్యారీస్, ఫిబ్రవరి 8: విద్యార్థులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని భారత ప్రభుత్వ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్, విద్యా మంత్రిత్వ శాఖ డైరెక్టర్ డా.ఉషా నటేశన్ పిలుపునిచ్చారు. షోలింగనల్లూర్‌లోని సెయింట్ జోసఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ,కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం సంస్థ ఛైర్మెన్ డా.బి.మనోహరన్ అధ్యక్షతన అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇండస్ట్రీ 4.0 ఎరాఫన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై జరిగిన ఈ సదస్సుకు 16 దేశాల నుంచి 44 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. అతిథి, విదేశీ ప్రతినిధులను డా.బాబూ మనోహరన్ జ్ఞాపికలతో సత్కరించారు.

తిరునాంగూరు దివ్యక్షేత్రం

స్వర్ణ గరుడసేవలు ప్రత్యేకం

వైష్ణవాలయాల్లో వేంకటేశ్వరస్వామి గరుడోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. ఆ ఉత్సవాన్ని తిలకిస్తే వైకుంఠ ప్రాప్తి లభిస్తుందని వైష్ణవపండితుల ఉవాచ. అయితే ఒకే సమయంలో ఒకే ఆలయంలో ఏకాదశ (11) వైష్ణవ దివ్యక్షేత్రాల (ఆలయాల) నుంచి స్వర్ణగరుడ వాహనాలపై ఊరేగింపుగా ఒకే చోట కొలువుదీరితే ఆ అత్యద్భుత దృశ్యాన్ని చూడటానికి వేయి కనులు చాలవంటే అతిశయోక్తి కాదు. ఈ ఏకాదశ గరుడ సేవలను పొందే పెరుమాళ్ళను మైలాడుదురై జిల్లా సీర్గాళి సమీపంలోని తిరునాంగూరు క్షేత్రంలో మణిమాడ కోవిల్ అని పిలిచే నారాయణ పెరుమాళ్ ఆలయంలో ప్రతియేటా తమిళమాసం తై అమావాస్య మరుసటి రోజు వీక్షించవచ్చు. శనివారం జరుగనున్న ఈ 'పెద్ద పెరుమాళ్ల' గరుడోత్సవం కోసం తిరునాంగూరు ఆలయం ముస్తాబవుతోంది. అష్టోత్తర శత (108) వైష్ణవ దివ్యదేశాల్లో ఆరు క్షేత్రాలు తిరునాంగూరులోనే ఉన్నాయి. వీటితోపాటు ఆ క్షేత్రం చుట్టూ నాలుగు కిలోమీటర్ల దూరంలో మరో ఐదు వైష్ణవ దివ్యదేశాలు కూడా ఉన్నాయి.

- ఆంధ్రజ్యోతి, చెన్నై


తిరునాంగూరు నారాయణ పెరుమాళ్


గరుడ వాహనంపై కొలువుదీరిన కుడమాడు కూత్తర్

ఏకాదశ దివ్యదేశాలు...

తిరునాంగూరులోనే తిరుక్కావనంపాడి గోపాలన్ ఆలయం, తిరు అరిమేయ విన్నగరం కుడమాడు కూత్తర్ ఆలయం, తిరువెణ్పురుడోత్తమం వణ్పురుషోత్తమ పెరుమాళ్ ఆలయం, తిరుచెంపొన్ సెయ్ ఆలయం చెంపొన్నారంగర్ ఆలయం, తిరుమణిమాడ కోవిల్ నారాయణ పెరుమాళ్ ఆలయం, తిరువైకుంఠ విన్నగరం వైకుంఠనాధర్ ఆలయం, తిరునాంగూరుకు వెలుపల తిరుత్తేవనార్ తొగై మాధవపెరుమాళ్ ఆలయం, తిరుత్తెరియుంబలం పళ్ళికొండ పెరుమాళ్ ఆలయం, తిరుమణికూడమ్ వరదరాజపెరుమాళ్ ఆలయం, తిరువెళ్లకుళం అన్నన్ పెరుమాళ్ ఆలయం, తిరుపార్థనపళ్లి పార్థసారధి పెరుమాళ్ ఆలయం ఉన్నాయి.

తిరుమంగై ఆళ్వార్ ఆగమనం...

ప్రతియేటా తమిళమాసమైన తై నెల అమావాస్య మరుసటి రోజు ఏకాదశ గరుడసేవల సందర్భంగా 11 దివ్యదేశాల్లోని పెరుమాళ్లు కూడా తిరునాంగూరు తనిమాడకోవిల్ అనే నారాయణ పెరుమాళ్ ఆలయంలో కొలువుదీరి భక్తులకు దివ్య దర్శనమిస్తారు. ఈ ఏకాదశ గరుడ సేవలను తిలకించేందుకు తిరుమంగై ఆళ్వార్ వేంచేస్తారనేది పురాణగాథ. ఈ ప్రకారమే ఈ గరుడ సేవల ముందు రోజు రాత్రి ఆలయానికి చేరువుగా ఉన్న పొలాల్లో ఏవరో నడిచి వచ్చే శబ్దాలు వినిపిస్తాయని భక్తులు చెబుతారు. తిరుమంగై ఆళ్వారే ఆ విధంగా వరి చేలలో నడిచి వచ్చి నారాయణ పెరుమాళ్ ఆలయంలో ఏకాదశ గరుడ సేవలను దర్శించి వెళతారని భక్తుల ప్రగాఢ విశ్వాసం. గరుడ సేవల ముందు రోజు వరి చేలలో తిరుమంగై ఆళ్వార్ పాదాల సవ్వడి వినిపించేంతవరకూ రాత్రంతా భక్తులు ఆలయంలో మౌనం పాటిస్తారు. వరిచేలలో నడిచే శబ్ధం వినగానే భక్తులంతా నారాయణా నారాయణా అంటూ భక్తి పారవశ్యంతో నృత్యం చేస్తారు.


స్వర్ణగరుడవాహనంపై మాధవ పెరుమాళ్

స్వీయ మంత్రోపదేశం...

మహావిష్ణువు తన శ్రీమన్ నారాయణా అనే నామధేయాన్ని అష్టాక్షరి మంత్రంగా మార్చి తన కుతానుగా గురువుగా, శిష్యుడిగా స్వీయ మంత్రోపదేశం చేసుకున్న అరుదైన పుణ్యక్షేత్రంగా తిరునాంగూరు ఖ్యాతి గడిచింది. ఆ స్వీయ మంత్రోపదేశం వల్లనే లోకంలోని జీవరాశుల్లోనూ తాను కొలువై ఉన్నట్లు శ్రీమన్నారాయణుడు చాటి చెప్పారు.


ఇంద్ర పుష్కరిణి

ఏకాదశ గరుడోత్సవం చూడ వేయి కనులు చాలవు వేంకటేశా!

వేడుకలకు ముస్తాబవుతున్న ఆలయం



ఆలయ రాజగోపురం


ఆలయ అంతర ప్రాకారం


వైకుంఠనాధర్


అన్నన్ పెరుమాళ్

స్థలపురాణం...

పూర్వం బ్రహ్మదేవుడికి పరమేశ్వరుడిలాగే ఐదు శిరస్సులుండేవి. దీంతో పరమశివుడికి తానే సమ ఉజ్జీ అని బ్రహ్మదేవుడు విర్రవీగేవాడు. ఈ విషయం తెలుసుకున్న పరమశివుడు బ్రహ్మదేవుడి ఐదు శిరస్సుల్లో ఒక దానిని ఖండించాడు. ఈ కారణంగా పరమశివుడికి బ్రహ్మహత్యా దోషం పట్టుకుంది. ఆ దోషాన్ని తొలగించుకునేందుకు గోకర్ణం అనే క్షేత్రంలో మహావిష్ణువును స్మరిస్తూ పరమేశ్వరుడు తపస్సు చేశారు.. ఆ తపస్సును మెచ్చి మహావిష్ణువు ప్రత్యక్షమై పలాసవనంలో ఉన్న తిరునాంగూరు క్షేత్రానికి వెళ్ళి అక్కడ ఏకాదశ (11) రుద్రరూపం ధరించి అశ్వమేధ యాగం చేయమని ఉపదేశించారు. ఆ ప్రకారం పరమేశ్వరుడు తిరునాంగూరు క్షేత్రం చేరుకుని ఏకాదశ రుద్రులుగా ఏర్పడి యాగం జరిపారు. ఆ యాగం నెరవేరే సమయంలో నారాయణుడు ప్రణవ విమానంలో ప్రత్యక్షమై పరమేశ్వరుడి దోషాన్ని తొలగించి ఏకాదశ రుద్ర రూపాలతో ఉన్న పరమశివుడి ఎదుట మహావిష్ణువు కూడా ఏకాదశ రూపాలలో దర్శనమిచ్చారు. ఆ మహావిష్ణువు 11 రూపాలే తిరునాంగూరు, దాని చుట్టు పక్కల 11 దివ్యదేశాలుగా ఆవిర్భవించాయని వైష్ణవపురాణాలు చెబుతున్నాయి.

కంచిలో మూడుసార్లు...

ఆలయాల నగరం కాంచీపురంలోని వరదరాజపెరుమాళ్ ఆలయంలో యేడాదికి మూడుసార్లు గరుడ సేవలు నిర్వహిస్తున్నారు. వైశాఖ బ్రహ్మోత్సవాలు, ఆణిమాస స్వాతి నక్షత్రంతో కూడిన పెరియాళ్వార్ సాత్రుముర్రై, ఆడి మాస పౌర్ణమి గజేంద్రమోక్షం ఉత్సవాల సందర్భంగా గరుడోత్సవం నిర్వహించటం ఆనవాయితీగా ఉంటోంది.

స్వర్ణగరుడ వాహన సేవలు...

తిరునాంగూరు మణిమాడకోవిల్ అనే నారాయణ పెరుమాళ్ ఆలయంలో తై అమావాస్య మరుసటి రోజు ఏకాదశ దివ్యదేశాలకు చెందిన ఏకాదశ పెరుమాళ్లు ఉదయం 11 నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు ఒకరి తర్వాత ఒకరుగా స్వర్ణగరుడ వాహనాలలో వేంచేస్తారు. ఆ పెరుమాళ్లకు తిరుమంజనం కూడా నిర్వహించి అలంకరిస్తారు. ఆ తర్వాత ఆలయ మాడవీధులలోనూ ఒకరి తర్వాత ఒకరుగా ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు. అనంతరం ఆ పెరుమాళ్లకు మంగళాశాసన మొనర్చి దీపారాధన చేస్తారు. మరుసటి రోజు వేకువ జాము ఐదు గంటలకు ఆ పెరుమాళ్లు మళ్లీ స్వర్ణగరుడ వాహనాలపై అధిరోహించి తమ స్వ క్షేత్రాలకు బయలుదేరుతారు. ఈ వేడుకలలో పాల్గొనే భక్తులకు జన్మరాహిత్యం కలుగుతుందని వైష్ణవ పండితులు చెబుతారు. అంతే కాకుండా 11 వేర్వేరు ఆలయాల నుండి వచ్చిన ఏకాదశ పెరుమాళ్లను ఒకే చోట దర్శించే భాగ్యం కలుగుతుంది. ఈ ఏకాదశ గరుడ సేవలను తిరునాంగూరు ఆలయంలో శనివారం నిర్వహించనున్నారు. ఆలయ నిర్వాహకులు, అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు ఆ వేడుకలకు గాను ఆలయంలో భారీ ఏర్పాట్లు చేపడతున్నారు.


గర్భాలయ గోపురం

కుంభకోణంలో ద్వాదశ గరుడసేవలు...

తిరునాంగూరు క్షేత్రంలో ఒకే సమయలో 11 గరుడ సేవలు నిర్వహిస్తున్నట్లే తంజావూరు జిల్లా కుంభోణంలోనూ తమిళ మాసమైన చిత్తిరైలో అమాస్య తర్వాత వచ్చే అక్షయ తృతీయ రోజున ద్వాదశ (12) గరుడ సేవలు జరుగుతాయి. ఈ వేడుకల్లో కుంభకోణంలోని సారంపాణి, చక్రపాణి, రామస్వామి, రాజగోపాలస్వామి, వరహాపెరుమాళ్, వెంకటరాయర్ అగ్రహారం పట్టాభిరామర్, మల్లుకై వీధి సంతానగోపాలకృష్ణన్, నవనీత కృష్ణన్, పుళియంజేరి వేణుగోపాలసామి, మేల్‌కావేరి వరదరాజపెరుమాళ్, నవనీత కృష్ణన్, చోడయప్పన్ వీధి రామస్వామి అంటూ ద్వాదశ పెరుమాళ్లు ద్వాదశ గరుడ వాహనాలపై పెరియకడై వీధిలో వేంచేస్తారు.


తిరుకోట్టియూరు నంబిగళ్ సన్నిధి

ఎలావెళ్ళాలి?

మైలాడుదురైకి రాష్టం నలుమూలల నుంచి రాష్ట్ర రవాణా సంస్థ బస్సులు, ఆమ్నీ బస్సులు నడుపుతున్నారు. ఆ బస్సులలో మైలాడుదురైకి వెళ్ళి అక్కడి నుంచి టౌన్ బస్సులు, ఆటోలు, టాక్సీల్లో 26 కి.మీల దూరం ప్రయాణిస్తే తిరునాంగూరు దివ్యక్షేత్రం చేరుకోవచ్చు. సీర్గాళికి 10 కి.మీ.ల దూరంలో ఈ ఆలయం ఉంది. ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 5 నుండి 9 గంటల వరకు ఆలయాన్ని తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

స్వామివారి నామధేయం : శ్రీమన్నారాయణుడు
అమ్మవారు : పుండరీకవళ్ళి తాయారు
ఉత్సవమూర్తి : అలత్తర్ కరియాన్
తీర్థం : ఇంద్ర పుష్కరిణి, రుద్ర పుష్కరిణి

'మంగై' నా సినీ ఇమేజ్‌ను మార్చేస్తుంది

● 'కయల్' ఆనంది

తాను ప్రధాన పాత్రను పోషించిన 'మంగై' చిత్రం తనకు ఎంతో స్పెషల్ అని, ఈ చిత్రం తన సినీ ఇమేజ్‌ను మారుస్తుందని హీరోయిన్ 'కయల్' ఆనంది గట్టి నమ్మకం వ్యక్తం చేశారు. ఏఎస్ఎం పిక్చర్స్ బ్యానరుపై నిర్మాత ఏఆర్ జాఫర్ సాధిక్ నిర్మాణంలో తెరకెక్కిన ఈ చిత్రానికి కుబేరన్ కామాక్షి దర్శకత్వం వహించారు. ఆనంది, దుషి, రామ్స్, ఆదిత్యా కదిర్ తదితరులు నటించారు. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ తాజాగా నగరంలో విడుదల చేశారు. ఇందులో కయల్ ఆనంది మాట్లాడుతూ, 'ఈ సినిమా ఒక ట్రావెల్ కథ. అందుకే అనేక షెడ్యూల్స్‌లో చిత్రీకరణ చేస్తే సమస్యలు వస్తాయని ఊహించి ఒకే షెడ్యూల్‌లో షూటింగ్ పూర్తి చేశాం. కథ ఏంటని దర్శకుడిని అడగ్గా.. ఆయన స్క్రిప్టు చేతిలో పెట్టారు. దాన్ని చదివిన తర్వాతే ఈ చిత్రాన్ని వదులుకోకూడదన్న నిర్ణయానికి వచ్చాను. ఒక మహిళ గురించి పురుషుడు మాట్లాడే కోణంలో సాగుతుంది. తన ప్రయాణంలో మహిళ ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటుందనే విషయాలను దర్శకుడు చాలా బాగా తెరకెక్కించారు. నా సినీ కెరీర్‌లో ఒక ముఖ్యమైన చిత్రంగా నిలుస్తుంది. ఈ చిత్రం తర్వాత దర్శకుడు మరో స్థాయికి చేరుకుంటారు' అని ఆనంది పేర్కొన్నారు. దర్శకుడు కుబేరన్ కామాక్షి మాట్లాడుతూ, 'హీరోయిన్ ఆనంది లేకుంటే ఈ చిత్రం ఈ స్థాయిలో రూపుదిద్దుకునేది కాదు. దుష్యంత్ మంచి నటుడు.. మంచి డ్రైవర్ కూడా. కవితా భారతి ఎన్నో విధాలుగా సహాయం చేశారు. ఆయన దర్శకుడు కావడంతో అనేక ఐడియాలు వచ్చారు' అని పేర్కొన్నారు. అలాగే చిత్ర యూనిట్ సభ్యులు మాట్లాడారు.



'మంగై' చిత్ర బృందం

10న సంతోష్ నారాయణన్ 'నీయే ఒలి'

ప్రముఖ సంగీత దర్శకుడు సంతోష్ నారాయణన్ సారథ్యంలో ఈ నెల 10న నగరంలో ఒక సంగీత విభావరి కార్యక్రమం జరుగనుంది. 'నీయే ఒలి' పేరుతో నిర్వహించే సంగీత విభావరిని ఇప్పటివరకు ఏ సంగీత దర్శకుడు చేయని విధంగా నిర్వహించనున్నట్టు గురువారం నగరంలో జరిగిన విలేకరుల సమావేశంలో సంతోష్ వెల్లడించారు. ఈ వివరాలను ఆయన వెల్లడిస్తూ, ఈ నెల 10వ తేదీ పెరిమేడులోని జవహర్‌లాల్ నెహ్రూ ఓపెన్ స్టేడియంలో భారీ ఎత్తున ఈ మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నాం. 'నీయే ఒలి - సౌండ్స్ ఆఫ్ ది సౌత్'ను ఒక మ్యూజిక్ కాన్సర్ట్‌గా కాకుండా, ఒక ఎక్స్‌పీరియన్స్‌గా ప్లాన్ చేశాం. నేను పనిచేసిన దర్శకులు, సంగీత దర్శకులను ఆహ్వానించాం. ముఖ్యంగా సంగీత విభావరిని ఒక 'గ్రీన్ కాన్సెప్ట్' తరహాలో నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం. ఇందుకోసం చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్‌తో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాం. ఈ కార్యక్రమానికి వచ్చేవారు వాహనాల్లో కాకుండా, మెట్రో రైళ్ళలో రావాలి. ఇందుకోసం వారు ప్రత్యేకంగా టిక్కెట్లు కొనుగోలు చేయాల్సిన పనిలేదు. మ్యూజిక్ కాన్సర్ట్ కోసం కొనుగోలు చేసిన టిక్కెట్లను స్కాన్ చేసి ఉచితంగా ప్రయాణం చేయొచ్చు. నాతో పాటు మా బృందం కూడా ఈ కార్యక్రమానికి మెట్రో రైల్‌లో ప్రయాణించి ఇక్కడకు రానున్నాం. యువ ప్రతిభావంతులైన కళాకారులను ప్రోత్సహించాలన్న ఏకైక కాన్సెప్టుతో దీన్ని నిర్వహిస్తున్నాం. గతంలో జరిగిన అనేక చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నాం. మేకింగ్ మూవ్‌మెంట్స్ అనే సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది' అని సంతోష్ నారాయణన్ వివరించారు.


సంతోష్ నారాయణన్

కొత్త దర్శకులే అవకాశాలిస్తున్నారు

● 'జయం' రవి



తాను కొత్త దర్శకులకు అవకాశం ఇవ్వడం లేదని, నిజానికి కొత్త కుర్రాళ్ళే (డెబ్యూ డైరెక్టర్లు) తనకు అవకాశాలిస్తున్నారని హీరో జయం రవి అన్నారు. అలాగే, ఒక్కసారి దర్శకుడిని నమ్మిన తర్వాత ఆ తర్వాత ఎట్టిపరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోనని వెల్లడించారు. ఆయన నటించిన తాజా చిత్రం 'సైరన్'. అంటోనీ భాగ్యరాజ్ తొలిసారి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కీర్తి సురేష్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటించారు. ఈ నెల 16న విడుదలకానున్న నేపథ్యంలో ఈ చిత్రం ఆడియో, ట్రైలర్ బుధవారం సాయంత్రం నగరంలో విడుదల చేయగా, జయం రవితో పాటు సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్, సముద్రఖని తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయం రవి మాట్లాడుతూ, 'ఎడిటర్ రూబెన్ ద్వారా దర్శకుడు పరిచయమయ్యారు. ఆయన చెప్పిన కథ నాకు బాగా కనెక్ట్ అయింది. అందుకే అంగీకరించాను. నాతో సినిమా నిర్మించేందుకు నాకు అమ్మ లాంటి మా అత్త ముందుకు వచ్చారు. ఒక ప్రాణాన్ని కాపాడేందుకు కొన్ని సెకన్లే అత్యంత కీలకమని సందేశమిచ్చే చిత్రం. తొలిసారి రెండు విభిన్న గెటప్‌లలో నటించాను. ఇందులోని ప్రతి సన్నివేశం క్లైమాక్స్‌ను సాగుతుంది. 'కోమాలి' చిత్రం తర్వాత హాస్య నటుడు యోగిబాబుకు నాతో ఫుల్‌లెంగ్త్ క్యారెక్టర్. 75 రోజుల పాటు షూటింగ్ జరిగింది. నేను కొత్త దర్శకులకు అవకాశం ఇస్తున్నాననే ప్రచారం సాగుతుంది. నిజానికి వారే నాకు అవకాశాలు ఇస్తున్నారు. వారి శ్రమ, ప్రతిభ నా కోసం వెచ్చిస్తున్నారు. నేనే కేవలం ఒక పరికరం మాత్రమే' అని జయం రవి పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

ఆర్చిడ్స్ ఇంటర్నేషనల్ స్కూలులో 'ఇమేజిన్ హబ్' ప్రారంభం


'ఇమేజిన్ హబ్' ప్రారంభోత్సవంలో పాల్గొన్న పాఠశాల నిర్వాహకులు, అతిథులు

చెన్నై, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరుంబాక్కంలోని ఆర్చిడ్స్ ఇంటర్నేషనల్ స్కూలులో గురువారం 'ఇమేజ్ హబ్' ప్రారంభోత్సవ వేడుకలు అటహాసంగా జరిగాయి. ఈ వేడుకల్లో ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్లు శ్రీధర్ మాస్టర్, ఆయన కుమార్తె అక్షద శ్రీధర్, సినిమాటోగ్రాఫర్ విదు అయ్యన్న, ఐసీసీఆర్ మాజీ రీజినల్ డైరెక్టర్ కే మహమ్మద్ ఇబ్రహీం ఖలీల్, ఆర్చిడ్స్ అకడమిక్స్ వైస్ ప్రెసిడెంట్ బి.మంజుల, ప్రిన్సిపాల్ టి.లావణ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రానమీ, రోబోటిక్స్, మాక్ కోడింగ్, టింకరింగ్, డ్యాన్స్, థియేటర్, మ్యూజిక్, వీవింగ్ అండ్ ప్రింటింగ్, పాటరీ, పెయింటింగ్ ల్యాబ్‌లను ప్రారంభించారు. విద్యార్థుల్లో మేథోసంపత్తిని పెంపొందించేందుకు ఈ ప్రత్యేక లాబ్‌లు ఏర్పాటు చేశామని, వీటి ద్వారా చదువులతో పాటు నృత్యం, సంగీతం, కళాత్మక వస్తువుల తయారీ తదితర కళలలో సునిశిత శిక్షణను పొందగలుగుతారని ఆర్చిడ్స్ ఇంటర్నేషనల్ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ వేడుకల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



విజేతలతో శ్రీలక్ష్మి మోహనరావు, ఆచార్య ప్రసాద్ తదితరులు


శ్రీశ్రీతో అనుబంధం మరువరానిది

● ఆచార్య ఎంఏ ప్రసాద్

ప్యారీస్, ఫిబ్రవరి 8: మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ)తో తనకున్న అనుబంధం జీవితంలో మరువరానిదని మోటివేషనల్ స్పీకర్ ఆచార్య ఎంఏ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రపంచ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హాస్య చతురోక్తులు, ఆధునిక తెలుగు కవి శ్రీశ్రీతో తనకున్న అనుబంధంపై నిర్వహించిన ప్రత్యేక సదస్సులో వక్త ప్రసాద్ ఛలోక్తులు, సామెతలు, పిట్ట కథలతో శ్రోతలను ఆకట్టుకున్నారు. వరుసకు శ్రీశ్రీకి తాను మనువడినని, ఆయన చలువ వల్లే తాను తెలుగు మీడియం చదవకపోయినా, 400 ప్రసంగ కార్యక్రమాలను అచ్చ తెలుగులో నిర్వహించగలిగానన్నారు. ప్రముఖ కవులు దేవులపల్లి కృష్ణశాస్త్రి, కొసరాజు, సముద్రాల, ఆరుద్ర, ఆత్రేయ, దాశరధిలతో పాటు అమర గాయకుడు ఘంటసాల, తమిళ సినీ గేయరచయిత కన్నదాసన్ వంటి మహానుభావులు పరిచయం అయ్యారన్నారు. శ్రీశ్రీ తెలుగు, తమిళ భాషల్లో పండితుడని, ఆయన రాసిన పాటలు ఆణిముత్యాలుగా నేటికీ శ్రోతలను మైమరిపిస్తున్నాయన్నారు. ప్రార్థనాగీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమానికి సమాఖ్య కార్యదర్శి శ్రీలక్ష్మి మోహనరావు సారథ్యం వహించి, సమాఖ్య అధ్యక్షురాలు డా.వీఎల్ ఇందిరాదత్ పంపించిన సందేశాన్ని సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో భాగంగా లలిత సుధాకర్ తెలుగు సంభాషణపై నిర్వహించిన పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని బహుమతులు గెల్చుకున్నారు. కార్యక్రమంలో తాతినేని జయశ్రీ, ప్రమీలా ఆనంద్, గోటేటి వెంకటేశ్వరరావు, పీఆర్ కేశవులు, సభ్యులు పాల్గొన్నారు.

సుమోటో కేసులు విచారించనున్న జస్టిస్ ఆనంద్

● ప్రధాన న్యాయమూర్తి అనుమతి


మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.ఆనంద్ వెంకటేష్

పెరంబూర్, ఫిబ్రవరి 8: ప్రస్తుత, మాజీ మంత్రులపై సుమోటో కేసుల విచారించేందుకు ప్రధాన న్యాయమూర్తి తనకు అనుమతులిచ్చారని మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ తెలిపారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని ప్రస్తుత మంత్రులు తంగం తెన్నరసు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ఐ.పెరియస్వామిలను కేసుల నుంచి విడిపించడం, విడుదల చేస్తూ జారీచేసిన ఉత్తర్వులను పునఃసమీక్షించేలా మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి ఆనంద్ వెంకటేష్ తనకు తానుగా ముందుకొచ్చి సుమోటో కేసులుగా స్వీకరించారు. అలాగే, మాజీ మంత్రులు పొన్ముడి, ఒ.పన్నీర్‌సెల్వం, వలర్మతి తదితరులకు వ్యతిరేకంగా నమోదైన కేసులను కూడా సుమోటా కేసులుగా విచారణకు స్వీకరించారు. ఈ నేపథ్యంలో, అందుకు వ్యతిరేకంగా మంత్రులు తంగం తెన్నరసు, కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్ తరఫున దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు. ఈ కేసులు ఎవరు విచారించాలి అన్న విషయం మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి వలర్మతిలకు వ్యతిరేకంగా తమకు తాముగా విచారణకు స్వీకరించిన కేసులను న్యాయమూర్తి ఎన్.ఆనంద్ వెంకటేష్ గురువారం విచారించారు. ఆ సమయంలో న్యాయమూర్తి.. ప్రస్తుత, మాజీ మంత్రులకు వ్యతిరేకంగా నమోదుచేసిన సుమోటో కేసులు విచారించాలని ప్రధాన న్యాయమూర్తి, తనకు కేటాయించారని తెలిపారు. ఆ ప్రకారం మంత్రులు కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, తంగం తెన్నరసు, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం, మాజీ మంత్రి వలర్మతి తదితరాలకు వ్యతిరేకంగా నమోదైన నాలుగు కేసులు ఈ నెల 27,28,29 మార్చి 5వ తేది విచారించనున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఇప్పటికే ప్రకటించిన విధంగా మంత్రి ఐ.పెరియస్వామికి వ్యతిరేకమైన కేసు విచారణ ఈ నెల 12,13 తేదీలు, మాజీ మంత్రి పొన్ముడి కేసు విచారణ ఈ నెల 19,22 తేదీల్లో చేపట్టనున్నట్లు న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.


రాయర్స్ నిర్వాహకులు మోహన్, మనోజ్‌లకు అవార్డు అందజేస్తున్న దృశ్యం

రాయర్స్ మెస్‌కు మైలాపూర్ అవార్డు

ప్యారీస్, ఫిబ్రవరి 8: తొమ్మిది దశాబ్దాలకు పైగా రాజధాని నగరం చెన్నైలో రుచికరమైన, సంప్రదాయ వంటకాలు ప్రజలకు అందిస్తున్న రాయర్స్ మెస్ స్పిరిట్ ఆఫ్ మైలాపూర్ అవార్డు సొంతం చేసుకుంది. మైలాపూర్‌లో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సుందరం ఫైనాన్స్ ఎండీ రాజీవ్‌లోచన్, డిప్యూటీ ఎండీ ఎస్.రాజు, చిత్రకారులు పి.శ్రీరామ్‌ల చేతుల మీదుగా రాయర్స్ నిర్వాహకులు పి.మోహన్, కె.మనోజ్‌లు ఈ అవార్డు అందుకున్నారు.

రేపటి నుంచి సెమ్మొళి పార్క్‌లో పుష్ప ప్రదర్శన

పెరంబూర్, ఫిబ్రవరి 8: స్థానిక తేనాంపేటలోని సెమ్మొళి పార్క్‌లో ఈ నెల 10 నుంచి 20వ తేది వరకు పుష్ప ప్రదర్శన జరుగనుంది. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేయనున్న ఈ ప్రదర్శనను యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి ప్రారంభించనున్నారు. ఈ ప్రదర్శనలో పలు అరుదైన రకాలకు చెందిన పుష్పాలతో పాటు 12 లక్షల రంగు రంగుల పుష్పాలు ఏర్పాటుచేశారు. ఈ ప్రదర్శనకు వీక్షించే ప్రజలకు మరింత వినోదం కలిగించేలా సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటయ్యాయి. ఈ పుష్ప ప్రదర్శన వీక్షించేందుకు ప్రవేశ రుసుముగా పెద్దలకు రూ.150, 12 ఏళ్ల చిన్నారులకు రూ.75గా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.

